అందుకనే దాన్ని కత్తుల బోనం అని కూడా అంటరు. దేవయ్య తప్పెట పక్కన పెట్టి, నిండుకుండ నీళ్లు తెచ్చి, పద్మ కాళ్లకు పోసి మొక్కిండు. తర్వాత పిలగాడు కూడా మొక్కిండు.

తప్పెట్లు ఇంటింటికి పోయి బోనాలను పిలుచుకొచ్చినయి. అన్ని బోనాలు రాగానే, ఆ వాడంతా తిరుగుతూ.. బొడ్రాయి మీదుగా పోషమ్మకాడికి పోతరు. ముందల బైనోండ్లు, తర్వాత తప్పెట్లు, ఆ తర్వాత బోనాలు. ఆ తప్పెట దరువుకు మొగోళ్లు చిందాట ఆడుతుంటే, ఆడోళ్లు పైనిండుతుండ్రు. బొడ్రాయికి నూనె పూసి, పసుపుకుంకుమ పెట్టి, పోషమ్మ దగ్గరికి పోయి, గుడి చుట్టూ మూడుసార్లు తిరిగి గుడి లోపలికి పోయిండ్రు. అప్పటికే పటేల్ గుడికాడికి వచ్చిండు.

బైనోండ్లు పద్మ బోనం తీసుకుని పోషమ్మ ముందల పెట్టి మొక్కిండ్రు. పటేలొచ్చి కొబ్బరికాయ కొట్టి, కల్లు ఆరపుచ్చి, కూసొని మొక్కిండు. టెంకాయ కొట్టి లేస్తుంటే, గుడి పైకప్పు రాయి తలుగబోయింది. ఇంతలో పద్మ చూసి చేయి అడ్డుపెట్టింది. పటేల్ నెత్తొచ్చి పద్మ చేయికి తగిలింది. పద్మ నగుమొకంతో..

''సూసుకో పటేలా!'' అన్నది.

పటేల్ పైకి లేచి.. ఎవరైనా చూశిండ్రేమోనని అటూ ఇటూ చూసిండు. బైనోండ్లు, పద్మ బోనంల బువ్వ తీసి పోషమ్మ ముందర పెట్టిండ్రు. ఒకదాని తరువాత ఒకటి పెడుతుండ్రు. పటేల్ మేక తలకాయ కొట్టే వరకు ఉండి పోయిండు. ఈలోపు దేవయ్య కోడ్ని కోపిచ్చి, పిలగానికి ఇచ్చిండు.

మొగోళ్లందరూ కోలాటం.. ఆడోళ్లందరూ బొడ్డెమ్మ ఏస్తుండ్రు. కాసేపు పద్మ కూడా బొడ్డెమ్మ ఆడి, బోనం తీసుకొని పిలగాణ్ని పిల్చింది.

''అమ్మా.. నేను కొంచేపు ఉండి వస్తనే..'' అని కోసిన కోడ్ని ఇచ్చిండు పిలగాడు.

రెండు కట్టెలు పట్టుకుని, కోలాటం రాకపోయినా కొట్టుకుంటూ తిరుగుతుండు. పద్మ తప్పెట, బోనం, కోడ్ని పట్టుకొని దారిపొడుగున దేవయ్య పాట వినుకుంట పోతున్నది.

''నడుము సన్నం నాగరికం పిల్లో...
నీ ముక్కు మొకం సక్కదానమున్నది'' అని దేవయ్య పాడుతుండు.

పల్లాయి అయిపోయేలోపు పద్మ గుడిశెకొచ్చింది. బోనం ఇంట్లో పెట్టి, ఓ తట్ట తెచ్చుకొని అండ్ల కోడి బొచ్చు తీస్తున్నది. ఇంతలో గుడిశెలకు పటేల్ వచ్చిండు. బయట పనోడు ఉన్నడు.

''పటేలా.. ఏంది? ఇయ్యాలటప్పుడు వచ్చిండ్రు!''.

**''అయ్యా.. అమ్మ సచ్చిపోయిందే!'' అని తడారిన గొంతుతో చెప్పిండు పిలగాడు. దేవయ్య వెంటనే గుడిశెవైపు పరిగెత్తిండు. ''పద్మా..'' అంటూ లోపలికి పోయిండు. భార్య తలను ఒళ్లో పెట్టుకొని కూసున్నడు.**

''ఏం లేదు పద్మా! ఇందాక పండుగయినాక ఇంటికి పోయి తాగుతున్న.. ఏం మనసున వద్దలేదు!''.

''ఎందుకు? ఏమైంది పటేలా!''.

''నా చిన్నప్పట్నించి ఓ అలవాటుంది. ఏ కులం తక్కువదైన నన్ను తాకితే.. నేను దాన్ని మొత్తం తాకాలి. లేకపోతే నాకు మనసున వట్టదు!''.

''ఏంది పటేలా.. పరాష్కాలాడుతుండవా!?''.

''నీతోటి నాకు పరాష్కాలేందే..'' అంటూ బలంగా కొట్టిండు.

దాంతో పద్మ కిందవడ్డది.

''రామా రామా ఎల్లమ్మకో..
రాముల పరిషాలెల్లమ్మకో..
పసుపు బండారెల్లమ్మకో..
యాపాకు నీలెల్లమ్మకో..'' అంటూ దేవయ్య రెండు ఉద్దులు ఒకతోటి మాగే పాట చెప్పుండు.

పద్మ బతిమిలాడుతున్నది. చేతులెత్తి మొక్కుతున్నది.. అవి ఆ మృగానికి కనిపియ్యలే..

''నల్లరాజా.. నల్లరాజా.. ఎన్నియాలో
నల్లరాజా కొడుకులంటా.. ఎన్నియాలో
నలుగురన్నదమ్ములంటా.. ఎన్నియాలో''
అంటూ మరో పాట అందుకున్నడు దేవయ్య.

కొండచిలువ రక్తం పీల్చి, శవాన్ని వదిలేసినట్టు వదిలేసిండు పద్మను.

ఇంతలో పనోడు తలుపు తట్టి..

''పటేలా.. ఎవరో వస్తుండ్రు'' అన్నడు.

పటేల్ కంగారు కంగారుగా ఉరికిండు.

''అమ్మా.. బెల్లం బువ్వా..'' అంటూ తలుపు కాడి కొచ్చి లోపలికి సూసిండు పిలగాడు.

పద్మ నిస్సహాయంగా రక్తంలో పడి ఉంది.

వానికి ఏం అర్థం కాలేదు.

''అమ్మా..'' అంటూ దగ్గరికి వెళ్లిండు. పద్మ తేల కండ్లేసింది. కండ్లు ఎటో సుస్తుండయి. పద్మకు కాస్త దూరంలో కోసుకొచ్చిన కోడి పడి ఉంది. పిలగాడు పద్మను, కోడ్ని మార్చి మార్చి సూసిండు. ఒకే విధంగా కనిపించేసరికి.. పిలగాడు ఏడ్చుకుంట కోలాటం కాడికి ఉరికిండు.

''పైనవొయే పక్షులారా.. ఎన్నియాలో
ఆడపిల్ల గతి ఇంతే సూడు.. ఎన్నియాలో'' అంటూ దేవయ్య చెప్పే పాట చివరకొచ్చింది.

''అయ్యా అయ్యా.. అమ్మ సచ్చిపోయిందే!'' అని తడారిన గొంతుతో చెప్పిండు పిలగాడు.

దేవయ్య వెంటనే గుడిశెవైపు పరిగెత్తిండు.

''పద్మా..'' అంటూ లోపలికి పోయిండు.

భార్య తలను ఒళ్లో పెట్టుకొని కూసున్నడు. అక్కడ పడిన రక్తాన్నంత మెడలో ఉన్న తుండుతో తుడిసిండు. తెల్లది కాస్త ఎర్రగా మారింది. వాడలో అందరికీ తెలిసి, ఒక్కొక్కరు వచ్చి గుమికూడిండ్రు. ఎవరికీ ఏం అర్థమైతలేదు. అందరూ గుండెలు బిగపట్టి సూస్తున్నరు. దేవయ్య పద్మను గుండెలకు హత్తుకుని..

''పద్మా..'' అని గట్టిగా అరిసిండు.

బిగపట్టిన గుండెలన్నీ గొల్లుమన్నాయి. ఆ ఆర్తనాదాలకు పక్కనే పండుకున్న బొందలగడ్డ నిద్రలేచి ఆ గుడిశెను ఆక్రమించింది.

దేవయ్యకు ఈ ప్రపంచంలో ఒంటరోడైనట్టు అనిపిచ్చి, లేసి బయటికొచ్చిండు. కొయ్యకు ఏలాడుతున్న తప్పెట భుజానికి ఏసుకున్నడు. ఏ దరువేస్తుండో ఎవరికీ అర్థం కాలేదు. వాడి తప్పెట దరువు, చినుకు చినుకు కలిసి వానయినట్టు.. వాన కాస్త జడివానగా, తుఫానుగా మారుతున్నది. దానిపై మెరుపులు మెరుస్తున్నయి.. పిడుగులు పడుతున్నయి. అప్పటిదాకా చిందులేసిన బొందలగడ్డ కర్ణభేరి పగిలి అరుస్తున్నది.

ఎన్ని సంగీత వాయిద్యాలు వచ్చినా, మనిషి నరాల్లోని రక్తాన్ని మరిగించే శక్తి ఒక్క తప్పెటకే ఉంది. అప్పటివరకు రక్తం చచ్చుబడి, బొందలగడ్డలోని శవాలకు, ఆ వాడలోని మనుషులకు పెద్ద తేడా ఉండేది కాదు. ఇప్పుడు ఆ తప్పెట దరువుకు వాళ్ల రక్తం వాళ్లకు తెలియకుండానే మరుగుతున్నది. దేవయ్య వేళ్ల పగిలి రక్తం కారుతున్నాయి. అయినా దరువు ఆగుతలేదు.

శివుడు తాండవం ఆడితే పార్వతిదేవి ఆపుతది. పార్వతిదేవి తాండవమాడితే శివుడు ఆపుతడు. కానీ, ఇప్పుడు ఈ జాంబవంతుణ్ని ఎవరు ఆపుతరు? ఎట్ల ఆపుతరు?

తప్పెట తాండవం ఆడుతున్న దేవయ్యకు పిలగాడు కనిపించిండు. గుడిశె ముందు కూసోని ఏడుస్తుండు. దేవయ్య చూపు ఆ పక్కనున్న చెప్పుల మీదికోయింది. వెంటనే తప్పెట ఆపిండు. ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవహించింది. బొందలగడ్డలోని శవాలన్నీ ఊపిరి పీల్చుకున్నయి. అక్కడున్న అందరూ దేవయ్య వైపు చూశిండ్రు. దేవయ్య మాత్రం చెప్పుల వైపు చూస్తుండు. అందరూ చెప్పుల వైపు చూశిండ్రు. ఆ గుంపుల నుంచి..

''పటేలు చెప్పులు ఈడెందుకున్నయి..!?''
అన్నరు ఎవలో..

''రేయ్.. పటేలా'!' అని అరుసుకుంటూ, పటేల్ ఇంటివైపు ఉరికిండు దేవయ్య.

అప్పటివరకు మరిగిన రక్తాలు కూడా వాడితోపాటు కదిలాయి. దేవయ్యకు అది పగే కావొచ్చు.. కానీ ఈ సమాజానికి అదొక విప్లవం.

ఒక పద్మం రాలిపోయింది. కానీ, అక్కడొక విప్లవ పద్మం పూసింది.

కోలాటాలు, బొడ్డెమ్మలు ఈ సంస్కృతిలో భాగం. అలాగే అత్యాచారాలు కూడా ఈ సంస్కృతిలో కంటికి కనిపించకుండా భాగమయ్యాయి. కనిపించే ఈ కోలాటాలు, బొడ్డెమ్మలు అంతరించిపోతున్నాయి. కానీ, కనిపించని ఈ ముదనష్టపు అత్యాచారాలు ఎప్పుడు అంతరిస్తాయో.! వాటిని ఎప్పుడు బొందవెట్టాల్నో..!! ■


## చింతకింది శివశంకర్



తెలంగాణ మాండలికంలో.. మనసుకు హత్తుకొనే కథలు రాస్తున్నారు యువ రచయిత చింతకింది శివశంకర్. ఈయన రాసినవి తక్కువ కథలే అయినా.. అన్నీ వాసికెక్కినవే! శివశంకర్ స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అంబట్‌పల్లి గ్రామం. తల్లిదండ్రులు చింతకింది అపరంజమ్మ – వెంకటయ్య. బీటెక్ (ఈసీసీ) చేశారు. సైయంట్, ఇన్ఫోసిస్ సంస్థల్లో టెలికామ్ ఇంజినీర్‌గా ఐదేళ్లు పనిచేశారు. సాహిత్యాభిలాషతో 2021 నుంచి కథలు, కవితలు రాస్తున్నారు. ఈయన రాసిన మొదటి కథ.. 'స్వాతంత్ర్యం'. నమస్తే తెలంగాణ – ముల్కనూర్ ప్రజా గ్రంథాలయం నిర్వహించిన 2021 కథల పోటీలో రూ.1000 బహుమతి గెలుచుకున్నది. మరణం అంచున నేను, స్వజాతి, పమేరియన్ కథలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. 'విషనరుడు' పేరుతో ఓ కవితా సంపుటి ప్రచురించారు. 'చరిత కామాక్షి' అనే సినిమాతోపాటు 'గప్ చుప్' అనే వెబ్ సిరీస్‌కు రచయితగా పనిచేశారు. యూట్యూబ్ చానెల్ ద్వారా వివిధ రకాల పుస్తకాల గురించి వివరిస్తున్నారు. 'అసుర తెలుగు పోడ్‌కాస్ట్'ను నిర్వహిస్తున్నారు.